# కార్యకర్తలపై దాడులు సహించం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హెచ్చరిక



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 23, (ప్రజా జ్యోతి):** బీఆర్ ఎస్ కు చెందిన కార్పొరేటర్ కాంగ్రెస్ కార్యకర్తపై దాడి చేసిన ఘటనపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో పోలీస్ కమిషనర్ ను కలిసి ఫిర్యాదు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అధికారం కోల్పోయిన తర్వాత

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
వరంగల్
ములుగు - మహబూబాబాద్
జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ
మంగళవారం | 24 | ఫిబ్రవరి | 2026 | పేజీలు : 8







# క్రీడల కేంద్రంగా ఓరుగల్లు

- ప్రతిభను గుర్తించేందుకే సీఎం కప్
- అట్టహాసంగా సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీలు ఎంపీ కడియం కావ్య

**హనుమకొండ ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి):** హనుమకొండ జిల్లాలో క్రీడాకారులకు కావలసిన కనీస సౌకర్యాలను సమకూరుస్తూ వారిని అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం సాయంత్రం హనుమకొండ జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ ప్రతిభ ఉండి ప్రోత్సాహం కరువైన నైపుణ్యం గల క్రీడాకారులను గుర్తిస్తూ వారిని ప్రోత్సహించేందుకు ఈ పోటీలుదోహదపడతాయన్నారు. జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులకు నిలయమైన ఓరుగల్లులో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని మెరుగైన క్రీడా సదుపాయాలు సమకూర్చినట్లు చెప్పారు. చిన్నారులను బాల్యం నుండే క్రీడల పట్ల ఆకర్షితుల్ని చేసేందుకు హన్మకొండలో క్రీడా పాఠశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో భాగస్వాములు అయితే మానసికంగా దృఢంగా ఉంటారు అన్నారు. మరో అతిథి వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేసిందన్నారు. అన్ని రంగాలతో పాటు క్రీడా రంగాన్ని ప్రోత్సహించాలనే సంకల్పంతో స్వతహాగా క్రీడాకారుడైన ముఖ్యమంత్రి నేతృత్వంలో గత రెండేళ్లుగా గణనీయంగా క్రీడల అభివృద్ధి జరిగిందన్నారు. ఫలితంగా అంతర్జాతీయ వేదికపై తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ కేంద్రంగా

మిగతా 2 లో...



# హనుమకొండ జిల్లాలో పట్టు సాగును ప్రోత్సహించాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):** హనుమకొండ జిల్లాలో పట్టు సాగును ప్రోత్సహించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్అన్నారు.శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఉద్యాన పంటల సాగుపై ఉద్యాన, వ్యవసాయ, డిఆర్డిఏ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఎంత విస్తీర్ణంలో పట్టు సాగు జరుగుతుందని, ఎంతమంది రైతులు సాగు చేస్తున్నారని, పట్టుపురుగులను ఎక్కడి నుండి రైతులు తీసుకువస్తుంటారని, మల్బరీ సాగు గురించిన వివరాలను జిల్లా కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారి అనసూయను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కందుల సాగు, ఎఫ్ పి ఓ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ

మిగతా 2 లో...

# కబ్జాకు గురైన రహదారి

- ఖననం చేయడానికి శవాన్ని తీసుకెళ్లలేని పరిస్థితి
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు



**వెంకటాపురం,ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి) :** ములుగు జిల్లా,వెంకటాపురం మండలం,ఉప్పెడు వీరాపురం గ్రామపంచాయతీ పరిధిలోని వెంగళరావుపేట గ్రామంలో రెండురోజుల క్రితం అనారోగ్యంతో ఒకరు మరణించారు.దహన సంస్కారాల కోసం పాడేను మోసుకొని వెళ్లడానికి సరైన మార్గం లేక అవస్థలు పడాల్సి వచ్చిందని గ్రామస్తులు

మిగతా 2 లో...

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద




**వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి):** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికైన ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధ్యక్షత వహించగా, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి, డిఎం హెచ్వో డా. సాంబ శివరావు, హౌసింగ్ పీడీ

మిగతా 2 లో...

## హనుమకొండ జిల్లాలో పట్టు సాగును ప్రోత్సహించాలి

(మొదటి పేజీ తరువాయి...)

ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పట్టు సాగును చేసే విధంగా ఉద్యాన శాఖ అధికారులు దృష్టి సారించాలని అన్నారు. జిల్లాలో పట్టు సాగును మరింత మెరుగు పరచాలని అధికారులకుసూచించారు.జిల్లాలో మహిళల ద్వారా అధిక మొత్తంలో మల్బరీ సాగు చేపట్టి, ఎక్కువ ఆదాయం వచ్చే పట్టుసాగును మహిళా సమాఖ్య ద్వారా ప్రోత్సహించి ఇతర రైతులకు స్ఫూర్తినివ్వాలని, గతంలో జిల్లాలో ఉన్న పట్టుసాగును పునరుద్ధరించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, డిఆర్డివో మేన శ్రీను, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, మార్కెటింగ్ అధికారి అనురాధ, డిఆర్డిఏ డిపిఎం లు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల కేంద్రంగా ఓరుగల్లు

(మొదటి పేజీ తరువాయి...)

కోట్లాది రూపాయల వ్యయంతో క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. . ఆటగాళ్లు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ అందు కనుగుణంగా నగదు నజరానాలను పొందవచ్చన్నారు. గత కొన్నేళ్లుగా జె ఎన్ ఎస్ వేదికగా కోట్లాది రూపాయల వ్యయంతో క్రీడలు అభివృద్ధి జరిగిందన్నారు. జిల్లా క్రీడలు యువజన అధికారి అశోక్ కుమార్ మాట్లాడుతూ 33 జిల్లాల నుండి దాదాపు 1600 మంది క్రీడాకారులు హాజరైనట్లు చెప్పారు. అనంతరం ఎంపీ కడియం కావ్య ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ గట్టు మహేష్ బాబు, హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేష న్ఉపాధ్యక్షుడు, డా.పి.రమేష్ రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ ప్రశాంత్, పెటా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు, కోచ్ లు, మేనేజర్లు పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన రహదారి

(మొదటి పేజీ తరువాయి...)

ఆవేదన వ్యక్తం చేశారు.వెంగళరావుపేట ఉప్పెడు,టేకులబోరు,తుర్సవాని గూడెం గ్రామాలకు సంబంధించిన వందలాది మంది రైతులు,రైతుకూలీలు ఈ దారివెంట ఇసుక పాయను దాటి గడ్డమీద వ్యవసాయ పనుల నిమిత్తం రోజు రాకపోకలు సాగిస్తుంటారు.ఈ గ్రామాలకు సంబంధించిన వ్యక్తులు ఎవరైనా మృతి చెందితే ఇదే మార్గం వెంట ఇసుకపాయకు తీసుకువెళ్లి ఖననం చేస్తుంటారు.పూర్వీకుల కాలం నుండి ఉపయోగిస్తున్న ఈ మార్గాన్ని ఉప్పెడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కబ్జా చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు.గతంలో కూడా ఇదే సమస్య ఎదురైతే ప్రజాజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన అప్పటి తహసిల్దార్ రాజయ్య వెంటనే సర్వేయర్ ను ఆ గ్రామానికి పంపించి సర్వే నిర్వహించిన అనంతరం దారిని కబ్జా చేసిన వ్యక్తికి నోటీసులు ఇవ్వడం జరిగింది.మళ్లీ అదే వ్యక్తి కబ్జా చేసి మిర్చిపంట వేయడంతో సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది.నాలుగైదు గ్రామాల ప్రజలు నడిచే మార్గాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకొని ఆ మార్గం వెంట ప్రశాంతంగా రాకపోకలు సాగించే విధంగా రహదారి సమస్యకు సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరారు.

## ఆర్థిక సహాయం అందించిన మిత్రులు.



**శాయంపేట ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి) :** తోటి మిత్రుని తల్లి నన్నెమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో పరమపదించారు. విషయం తెలుసుకున్న మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన సహచర మిత్రులు చిన్ననాటి మిత్రుడైన జబ్బర్ కు ఆర్థిక సహాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. స్నేహితులకు ఎలాంటి ఆపద వచ్చిన చేదోడు వాదోడుగా ఉంటూ కష్టసుఖాల్లో పాలు పంచుకుంటామని స్నేహితులు తెలిపారు. ఈ సందర్భంగా చదువు సంధ్యలు నేర్పించిన గురువైన కాలేశ్వరం నర్సయ్య కూడా ఆర్థిక సహాయం అందించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గడ్డమీది కరుణాకర్ భూర జనార్ధన్ నాలికే మధుసూదన్ తుడుం మోహన్ బాబు, చల్లా అశోక్ గాదె సుధాకర్ పాల్గొన్నారు.

# కార్యకర్తలపై దాడులు సహించం...

(మొదటి పేజీ తరువాయి...)

కూడా కొందరు ప్రతిపక్ష నేతలు గుండాల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ ఎస్ కార్పొరేటర్ కాంగ్రెస్ కార్యకర్తపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. గతంలో తోట పవన్ పై జరిగిన దాడిని గుర్తుచేస్తూ, ఇది ఒంటరి ఘటన కాదని, క్రమపద్ధతిలో జరుగుతున్న దాడుల శ్రేణిలో భాగమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓపిక పాటించాలని సూచిస్తున్నప్పటికీ, ఆ సహనాన్ని ప్రతిపక్షాలు బలహీనతగా భావిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఇకపై కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతలు కులం, ప్రాంతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర పోలీస్ శాఖ కఠిన



చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిన్నటి ఘటనలో కాంగ్రెస్ కార్యకర్త ప్రాణాపాయం జరిగి ఉంటే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. వినయ్ భాస్కర్ పై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, రాజకీయ లాభాల కోసం జిల్లాను ముక్కలు చేశారని ఆరోపించారు. భద్రకాళి ఆలయ పరిసరాల్లో గుడిసెల తొలగింపుపై గతంలో తీసుకున్న నిర్ణయాలను గుర్తుచేసి, ఇప్పుడు అమ్మవారి పేరుతో రాజకీయాలు చేయడం ద్వంద్వ వైఖరని విమర్శించారు. భద్రకాళి అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడం ఆపాలని సూచించారు. ప్రశాంత నగరాన్ని అస్థిరపరిచేలా వ్యవహరిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి నగర బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన అనేక హింసాత్మక ఘటనలకు కూడా అదే నాయకత్వం ప్రోత్సాహం ఇచ్చిందని ఆరోపించారు. పదేళ్ల అధికార కాలంలో కాలనీ, డివిజన్ స్థాయి సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజా ప్రయోజనాల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు.
అధికారంలో ఉన్నప్పటికీ సహనం బలహీనత కాదని, అభివృద్ధి తమ సిద్ధాంతమని, కక్షపూరిత రాజకీయాలు తమ స్వభావం కాదని స్పష్టం చేశారు. కార్యకర్తల రక్షణ విషయంలో రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి...)



శ్రీవాణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్, ప్రతి దరఖాస్తును స్వయంగా పరిశీలించారు. దరఖాస్తుదారుల సమక్షంలో నే సంబంధిత శాఖాధికారుల తో చర్చించి, సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరిష్కారం సాధ్యంకాని దరఖాస్తుల విషయంలో సంబంధిత అభ్యర్థులకు స్పష్టమైన కారణాలు తెలియజేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం, బాధ్యతాయుత వ్యవహారం ఉండాలని జిల్లా కలెక్టర్ పునరుద్ఘాటించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 150 దరఖాస్తులు అందగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 56, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించినవి 38, ఇతర శాఖలకు సంబంధించినవి 56 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యలు అధికంగా ఉన్నందున, వాటిని సంబంధిత తహసీల్దార్ల కు ఎండార్స్ చేస్తూ నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. వృద్ధులు, సామాజిక సంక్షేమం, పింఛన్లు వంటి అంశాలకు సంబంధించిన దరఖాస్తుల ను శిశు సంక్షేమం మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులకు పంపిస్తూ, మానవీయ దృక్పథంతో త్వరిత పరిష్కారం కల్పించాలని సూచించారు. ప్రజావాణి అనంతరం జిల్లాలో కొనసాగుతున్న "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్" కార్యక్రమంపై తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. భూ సంబంధిత రికార్డుల ఖచ్చితత్వం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసి, ఎలాంటి పొరపాట్లు లేకుండా గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డి సి ఓ నీరజ, డిబిసిడిఓ పుష్పలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## రెండు నెలల చిన్నారి మృతి ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎమ్మార్పీఎస్ మండల కోఆర్డినేటర్ అడ్డూరి అనిల్ మాదిగ



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి):** కుమ్మెర మల్లన్న జాతర సందర్భంగా అగ్రకుల అహంకారంతో జరిగిన దుర్ఘటనలో రెండు నెలల చిన్నారి మృతి చెందడం దారుణమని ఎమ్మార్పీఎస్ మండల కోఆర్డినేటర్ అడ్డూరి అనిల్ మాదిగ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేవుని దర్శనానికి వెళ్లిన కుటుంబంపై జరిగిన దాడి అమానుషమని ఆయన ఖండించారు. ధార్మిక స్థలాల్లో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉన్నాయని ఎవరికైనా కులం వర్గం పేరుతో అడ్డంకులు సృష్టించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలో పాల్పడిన అగ్రకుల రెడ్డి వారిని వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నారి మృతి రాష్ట్రవ్యాప్తంగా కలచివేసే అంశమని బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం కల్పించాలని సూచించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## 108 సిబ్బందికి స్టార్ అవార్డులు



**ధర్మసాగర్, ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి)** అత్యవసర సేవల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన సిబ్బందికి హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా స్టార్ అవార్డులు ప్రదానం చేశారు. అత్యవసర సమయంలో ప్రజలకు మొదట గుర్తుకొచ్చేది 108 సేవలేనని, కేసు అందిన 30 సెకండ్లలో బయలుదేరి, 10 నిమిషాల్లో ఘటనాస్థలానికి చేరుకుని ప్రాణాలు కాపాడడంలో 108 సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అధికారులు ప్రశంసించారు. ఈ అవార్డులు ధర్మసాగర్, ఐనవోలు, పరకాల మండలాలకు చెందిన సిబ్బందికి అందజేశారు. ధర్మసాగర్ మండలానికి చెందిన మాచర్ల వెంకటేష్ అందించిన విశిష్ట సేవలకు గాను వెంకటేష్ ను సత్కరించారు. వరంగల్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పాటి శివకుమార్, జిల్లా మేనేజర్ మంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడడంలో ముందుండే 108 సిబ్బందిని అధికారులు అభినందించారు.

# కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలు

- వినయ్ భాస్కర్
- దేవాదుల పూర్తి చేయడంలో వైఫల్యం
- బీఆర్ఎస్ ఆగ్రహం




**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 23, (ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ రెండున్నరేళ్లుగా కాలక్షేపం చేస్తోందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. సోమవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్ లో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీల అమలును మరిచి కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. బాధ్యత గల ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజల తరపున పోరాడుతోందని, పార్టీ కార్యాలయాలు "జనతా గ్యారేజ్" లాగా ప్రజలకు అందుబాటులో పనిచేస్తున్నాయని తెలిపారు.దేవాదుల ప్రాజెక్టులో 90 శాతం పనులను బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసిందని, మిగిలిన పనులను కూడా రెండేళ్లలో పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఇటీవల ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన హరీష్‌రావుకు అధికారులు కనీస ప్రోటోకాల్ ఇవ్వలేదని అన్నారు. రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల సమావేశంలో పార్టీ కోసం రూ.1000 కోట్లు వెచ్చిస్తామని చెప్పడం ఎవరి సొమ్మో చెప్పాలని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల పేరిట అవినీతి సొమ్ము కూడబెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, దేవాదుల ప్రాజెక్టు పూర్తి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు గడువులు మార్చడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. "విహారయాత్రలా 50 నిమిషాలు పర్యటన చేసి వెళ్లిపోయారు" అని ఎద్దేవా చేశారు.

దేవాదుల మూడో దశ అంచనాను రూ.17 వేల కోట్ల నుంచి రూ.24 వేల కోట్లకు పెంచడం వెనుక అవినీతి ఉందని ఆరోపించారు. మాజీ మంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ, వరంగల్‌కు హరీష్‌రావు వచ్చిన వెంటనే సీఎం ఆగమేఘాల మీద వచ్చి వెళ్లిపోయారని అన్నారు. హామీలు నిలబెట్టుకోలేక పోయినందుకు ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరికి పిండాలు పెట్టే కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. దేవాదుల ఫేజ్–1, 2లను కేసీఆర్ పూర్తి చేసి, ఫేజ్–3 పనులు ప్రారంభించారని గుర్తుచేశారు. రెండేళ్లు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదులలో ఒక్క పని కూడా ముందుకు జరపలేదని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవ్‌రెడ్డి, కార్పొరేటర్ జోరిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళీ దేవస్థానాన్ని సందర్శించిన ఎంపీలు, టీపీసీసీ నేతలు



**హనుమకొండ ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి)** వరంగల్ మహానగరంలోని చారిత్రక ప్రాశస్త్యమున్న శ్రీ భద్రకాళీ దేవస్థానంను ఈ రోజు ఉదయం పోరిక బలరాం నాయక్ దర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీకి ఆలయ ధర్మకర్త శ్రీ తొనుపునూరి వీరన్న ఘనస్వాగతం పలికారు. పూజానంతరం ప్రధాన అర్చకులు శ్రీ భద్రకాళి శేషు మహాదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో అమ్మవారి చిత్రపటాలను ఏర్పాటు చేయుటకు రైల్వే జనరల్ మేనేజర్‌తో మాట్లాడి అనుమతిఇప్పించవలసిందిగా కోరగా, వరంగల్ ఎంపీ కడియం కావ్య రైల్వే అధికారులతో స్వయంగా మాట్లాడి అనుమతి ఇప్పిస్తానని హామీఇచ్చారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ ధర్మకర్తలు గౌడె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, మోత్కూరి మయూరి రామేశ్వరరావులు స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహామండపంలో అర్చకులు, వేదపండితులు మహాదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వంశీ తదితరులు పాల్గొన్నారు. అని శ్రీ భద్రకాళీ దేవస్థానంకార్యనిర్వాహణాధికారి, సహాయ కమిషనర్ రామాల సునీత తెలిపారు.

## రోడ్డు పనుల నాణ్యతపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన కాంగ్రెస్ శ్రేణులు



**హసన్‌పర్తి,ఫిబ్రవరి–23(ప్రజాజ్యోతి):** వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ హసన్‌పర్తి ఆరవై ఆరవ డివిజన్ పరిధిలో రాంనగర్ నుంచి గాంధీనగర్ వరకు కొనసాగుతున్న సీసీ రహదారి పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారి వెడల్పు, నిర్మాణ నాణ్యతపై వారు అధికారులతో చర్చించి సూచనలు చేశారు.ప్రజలకు మౌలిక సదుపాయాలు మరింత మెరుగ్గా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతే ప్రధానమని, ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగంగా పూర్తిచేయాలని కోరారు. గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్య వసతులపై ప్రత్యేక దృష్టి సారించి 66వ డివిజన్ లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి చెరువు కట్టపై త్వరలో ప్రజావ్యాయామ కేంద్ర నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, వాస్తవాలు మరియు జరుగుతున్న పనులే పాలనకు నిదర్శనమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా, కులమత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే పాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదం ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీకి ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎర్రగట్టుగుట్ట దేవస్థానం చైర్మన్ జన్ను రవీందర్, ఎర్రగట్టుగుట్ట చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ పుల్ల రవీందర్, యువత అధ్యక్షులు తాళ్ల మధు, మండల సామాజిక మాధ్యమాల సమన్వయకర్త బిగుళ్ల సురేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పసికందును చంపిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- ఆర్టీఐ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు గౌడ్, కోకన్వీనర్ కుమార్ యాదవ్



**మల్హర్–ప్రజాజ్యోతి,ఫిబ్రవరి 23.** నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో రజక కుటుంబంపై దాడిచేసి,పసికందును చంపిన హంతకులను వెంటనే అరెస్ట్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఫోరమ్ పర్ ఆర్టీఐ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్,కో కన్వీనర్ చింతల కుమార్ యాదవ్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడారు కులవివక్షకు గురైన చాకలి కుటుంబం,అగ్రకుల బలుపుకు,రెండు నెలల పసికందు ప్రాణాన్నీ బలిగొన్నారని ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు.ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతుంటే కుమ్మెర గ్రామంలో దేవుని గుడిలోకి వస్తావా,మా దేవుని దర్శించుకుంటావా,సాకలి దాన అంటూ దుర్భషలాడి,చిత్రహింసలు పెట్టి,రెండు నెలల పసి గుడ్డును కసాయి కాలుతో తన్నితే క్షణంలో అక్కడే ప్రాణం విడిచిన పసిబిడ్డ తనువు చాలించిందన్నారు.దాడికి పాల్పడ్డ దోషులను శిక్షించేదాకా వామపక్షాలు, బిసి,దళిత బహుజన సంఘాలు,ప్రజా సంఘాలు,మానవతావాదులు ఏకం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఐ జిల్లా కమిటీ సభ్యుడు పోచయ్య పాల్గొన్నారు.

## ఎక్స్ ప్రెస్ బస్సుల నిలుపుదల కోరుతూ ఎమ్మెల్యే కు ఫోన్ ద్వారా ప్రజల వినతులు



**హసన్ పర్తి, ఫిబ్రవరి–23(ప్రజాజ్యోతి):** హసన్ పర్తి మండల కేంద్రంలో ఎక్స్ ప్రెస్ బస్సులు నిలిపి, టికెట్లు ఇచ్చే ఏర్పాటుతో కూడిన బస్సు నిలుపుదల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలంటూ ప్రజలు ఫోన్ ద్వారా వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రయాణికుల అభిప్రాయాలను సేకరించి వారి ఇబ్బందులను వివరించారు.మండల కేంద్రంలో ఎక్స్ ప్రెస్ బస్సులు ఆగకపోవడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. హసన్ పర్తి నుంచి నేరుగా ప్రయాణ సౌకర్యం లేక ఎల్కతుర్తి లేదా హనుమకొండకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా బస్సులు నిలవకపోతే ప్రయోజనం ఏముంటుందంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.మండల కేంద్రం చుట్టుపక్కల పది గ్రామాల ప్రజలు ప్రయాణాల కోసం హసన్ పర్తికి వస్తారని, ఇక్కడి నుంచి కరీంనగర్, వేములవాడ, సిరిసిల్ల, నిజామాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్తారని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎక్స్ ప్రెస్ బస్సులను తప్పనిసరిగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు, హసన్ పర్తి జాక్ అధ్యక్షులు అనుమాండ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ ఫోన్ కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు స్పందించి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రజల వినతులను తన సహాయకుడి ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని శాసనసభ్యులు భరోసా ఇచ్చారని వెల్లడించారు. స్పందించినందుకు శాసనసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రయాణికులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవం



**లింగాల గణపురం, ఫిబ్రవరి, 23( ప్రజాజ్యోతి )** కుందారం గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో నిర్వహించిన బీరప్ప –కామరతి కల్యాణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఆలయ పూజారులు, కురుమ కులస్తులు ఎమ్మెల్యే కు స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు ఆలయంలో స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కుందారం గ్రామ ప్రజలపై బీరప్ప స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ప్రజలందరూ సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండే విధంగా దీవించాలని ప్రార్థించారు. భవిష్యత్ లో ఆలయ అభివృద్ధికి నా వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగాల గణపురం మండల మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ కూకట్ల రాజు, ఉప సర్పంచ్ పాలమాకుల రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిట్ల బాబు, గ్రామ శాఖ అధ్యక్షులు అబ్బ సాయిలు మండల పార్టీ అధ్యక్షుడు శివ కుమార్, కుందారం గ్రామ కురుమ సంఘం అధ్యక్షులు చిర్ర రాజు, చిర్ర నరసయ్య, చిట్టే యాదగిరి, చిర్ర వీరస్వామి మాజీ వార్డు మెంబర్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి నీటి సమస్యకు ముందస్తు చర్యలు





**పర్వతగిరి, ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ సర్పంచులు, మిషన్ భగీరత ఏఈలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్ మాట్లాడుతూ, గ్రామాలలో ఉన్న అన్ని చేతి పంపులను తక్షణమే రిపేర్ చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే అత్యవసర పరిస్థితులు ఏర్పడితే హైరింగ్ ద్వారా నీటి సరఫరా చేయడానికి బావులను ముందుగానే గుర్తించి జాబితా సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచులను శాలువాలతో సన్మానించారు. వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో శేశాంజన్ స్వామి, గ్రిడ్ ఏ ఈ హరీష్, ఇంట్రా ఏ ఈ అరుణ్, పిఆర్ఏఈ కవిత, హౌసింగ్ ఏ ఈ ఉదయ చంద్ర, ఈజీఎస్ ఏపీవో సుశీల్, ఈసీ రాజు అధికారులు పాల్గొన్నారు.

# వైన్ షాప్ చుట్టూ బిర్యానీ ముసుగులో మద్యం రాజ్యం!

- పక్క గ్రామాల వారిదే పూర్తి హవా.... స్థానికులు పూర్తిగా గల్లంతు
- గ్రామపంచాయతీ అనుమతి ఉందా?
- బస్టాండ్ వద్ద విద్యార్థులు, మహిళలకు నరకయాతన



**పర్వతగిరి, ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి ):** వైన్ షాప్ పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా వెలసిన బిర్యాని సెంటర్లు ఇప్పుడు పర్వతగిరి మండల కేంద్రాన్ని కలవరపెడుతున్నాయి. మద్యం దుకాణాల చుట్టూ వరుసగా తెరుచుకుంటున్న ఈ సెంటర్లు ప్రజారోగ్యం కాదు ప్రజాశాంతికే ముప్పుగా మారాయని స్థానికులు మండిపడుతున్నారు. బిర్యాని సెంటర్ ముసుగులో మద్యం ప్రియుల అడ్డా నడుస్తోంది అన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇంకా దారుణం ఏమిటంటే... ఈ బిర్యాని సెంటర్ల నిర్వహణ మొత్తం పక్క గ్రామాల వారిదే రాజ్యంగా మారింది. స్థానికులకు ఒక్కరైనా చోటు లేకపోవడం గమనార్హం. మన ఊరి వ్యాపారాలు పక్క ఊరి చేతుల్లోకి ఎలా జారాయి? అంటూ ప్రజలు రోడ్డెక్కే స్థాయికి చేరుతున్నారు. ఇవన్నీ నడుస్తున్నా గ్రామ పంచాయతీ అనుమతి ఉందా? ట్రేడ్ లైసెన్స్ ఉందా? ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పే నాథుడే కనిపించడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా వెలసిన సెంటర్లపై అధికారులు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరింత భయంకరమైన పరిస్థితి ఏమిటంటే వైన్ షాపులు, బిర్యాని సెంటర్లకు అతి సమీపంలోనే బస్టాండ్ ఉండటంతో సాయంత్రం వేళ చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే స్కూలు పిల్లలు, కాలేజీ విద్యార్థులు, మహిళలు, వృద్ధులు మత్తులో ఊగిపోతున్న గుంపుల మధ్యే బస్సులు ఎక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక్కడ మరో షాకింగ్ విషయం బయటపడుతోంది. ఆకలితో వచ్చి ఏ బిర్యాని సెంటర్‌లో తిందామా? అని అనుకునే మద్యం ప్రియులు, చివరకు మద్యం దుకాణాలకే దర్శనం ఇస్తున్నారు. బిర్యాని కేంద్రాలు క్రమంగా తిండి కోసం కాదు.. మద్యం తాగి అరవడానికి, గొడవ పెట్టడానికి వేదికలుగా మారుతున్నాయి అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని ఫలితం ఆకలితో వచ్చిన మహిళలు, కుటుంబ సభ్యులు బిర్యాని తినలేక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. మద్యం మత్తులో ఉన్న వారు అశ్లీల మాటలు, అరుపుల మధ్య బిర్యాని ప్లేట్ పట్టుకుని కూర్చోవడమే భయంగా మారిందని మహిళలు వాపోతున్నారు. బస్టాండ్ వద్ద రోజూ గందరగోళం సాధారణమయ్యింది. దీంతో విద్యార్థులు ఆలస్యంగా ఇళ్లకు చేరడం, మహిళలు ఒంటరిగా ప్రయాణించడానికి భయపడటం నిత్యకృత్యంగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు మా పిల్లలు బస్టాండ్‌కు వెళ్లడమే నేరమా? బిర్యాని తినడానికి వెళ్లినా మద్యం గుంపుల్లో చిక్కుకోవాలా? ఇప్పటికైనా గ్రామపంచాయతీ, పోలీసు శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు మేల్కొని అక్రమ బిర్యాని సెంటర్లను వెంటనే మూసివేయాలి, అనుమతులు లేని వాటిపై కేసులు నమోదు చేయాలి, వైన్ షాప్ పరిసరాలను ఖాళీ చేయాలి, బస్టాండ్ వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి అని ప్రజలు గళమెత్తుతున్నారు. లేనిపక్షంలో పర్వతగిరి మండల కేంద్రం బిర్యాని కాదు మద్యం రాజ్యంగా మారి, విద్యార్థులు, మహిళల భద్రతకు శాశ్వత ముప్పుగా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ

**లింగాల గణపురం, ఫిబ్రవరి, 23 (ప్రజాజ్యోతి )::** మండలంలోని నెల్లుట్లప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల సహాయంతో బాయ్స్ టాయిలెట్స్ కు రెండు లక్షల యాబై వేల రూపాయలు మంజూరు కాగా అభివృద్ధి పనుల కు శంకుస్థాపన సర్పంచ్ నర్సింగ రామకృష్ణ ముఖ్య అతిథిగా జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బత్తిని అశోక్ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ దామర కావ్య ప్రభాకర్ పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి పంచాయతీ సెక్రెటరీ రొండ్ల శ్రీనివాస్ రెడ్డి,మాజీ పి ఎస్ సి ఎస్ డైరెక్టర్ గుర్రం బాలరాజు గౌడ్, వార్డ్ మెంబర్స్ వేల్పుల శోభారాణి, గొరిగే సందీప్, బొజ్జం సునీత ప్రభాకర్, నల్ల అజయ్ నల్ల విల్సన్ కొమ్మరాజుల రేణుక కొముురయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్, ఉపాధ్యాయురాలుసమ్మక్క,



జిల్లా సంయుక్త కార్యదర్శి దామెర నాగరాజ్,మాజీ సర్పంచ్ బోట్ల భాస్కర్, జనగామ మాజీ మార్కెట్ డైరెక్టర్ ముషిగంపల ఆంజనేయులు, నాయకులు కుర్రేముల రమేష్ కొత్తకొండ గోవర్ధన్, జెగ్గం ఆనంద్, అశోక్,చిట్ల తిరుమల రెడ్డి కొమ్మరాజుల నరసింహం, దేవరాయి రాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు

## రజక ఆడబిడ్డలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యుల డిమాండ్.



**చెన్నారావుపేట ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూల్ జిల్లా కమ్మెర గ్రామంలో రజక సామాజిక వర్గానికి చెందిన మహిళలపై జరిగిన అమానుష దాడిని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో రెండు నెలల పసిపాప మరణానికి కారణమైన ధనిక వర్గానికి చెందిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చెన్నారావుపేట మండల కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగం రమేష్ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో రజకులపై ఇటువంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, బాధ్యులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. నిరుపేద రజక కుటుంబాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంద నరేష్,ప్రధాన కార్యదర్శి నూనె తిలక్,ఉపాధ్యక్షురాలు అలువాల కళ్యాణి,మండల కమిటీ సభ్యులు చందర్ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కు నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఘన సన్మానం



**చెన్నారావుపేట ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో 19వ వార్డు కౌన్సిలర్‌గా ఘన విజయం సాధించిన ఎలకంటి విజయ్ ని చెన్నారావుపేట మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు విజయ్ కి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వార్డు ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన ముందుండి నడవాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సమ్మెట బిక్షపతి,ఉపాధ్యక్షుడు మల్లయ్య వరంగల్ అండర్ రైల్వే గేట్ నాయి బ్రాహ్మణ అధ్యక్షుడు వనపర్తి నవీన్,మురారి రవి,మురారి శంకర్,ఎడ్ల కుమారస్వామి, వనపర్తి లక్ష్మణ్, కందికొండ విజయ్, రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రాణాపాయ పరిస్థితుల్లో తక్షణ స్పందనకు మెడికవర్ హాస్పిటల్స్ వరంగల్ 'కోడ్ బ్లూ టీమ్' సిద్ధం




**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 23(ప్రజా జ్యోతి):** మెడికవర్ హాస్పిటల్స్ వరంగల్‌లో ఏర్పాటు చేసిన 'కోడ్ బ్లూ టీమ్' ప్రాముఖ్యత మరియు అత్యాధునిక అత్యవసర వైద్య సేవలపై సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన సమావేశములో వైద్యులు వివరించారు. కార్డియాక్ అరెస్ట్, శ్వాస ఆడకపోవడం లేదా రోగి అకస్మాత్తుగా కుప్పకూలడం వంటి ప్రాణాపాయ పరిస్థితుల్లో 'కోడ్ బ్లూ' ప్రకటించబడుతుందని వైద్యులు తెలిపారు. ఈ సమయంలో క్రిటికల్ కేర్ నిపుణులు, అనస్థీషియా వైద్యులు, ఎమర్జెన్సీ వైద్యులు మరియు నర్సింగ్ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం వెంటనే స్పందించి అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ఏ ఎల్ ఎస్) మరియు రీససిటేషన్ చికిత్సలను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన స్పందన రోగుల ప్రాణాలను కాపాడటంలో కీలకంగా ఉండటంతో పాటు సమస్యలు తలెత్తే అవకాశాలను గణనీయంగా తగ్గిస్తుందని తెలిపారు. ఈ కోడ్ బ్లూ టీమ్‌కు ఎమర్జెన్సీ మెడిసిన్ కన్సల్టెంట్ అండ్ హెచ్‌ఓడీ డా. దినేష్, క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డా. దీపక్, అనస్తీషియా కన్సల్టెంట్ డా. వాసు, క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డా. శాలిని నాయకత్వం వహిస్తున్నారని, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా మరియు సమర్థవంతంగా చికిత్స అందించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగం, సమన్వయం మరియు నిపుణుల వైద్య నైపుణ్యం అత్యంత ముఖ్యమని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో కోడ్ బ్లూ టీమ్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేందుకు క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్ మరియు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. అత్యాధునిక వైద్య సాంకేతికత, అధునాతన ఐసీయూ సదుపాయాలు, ఆధునిక వెంటిలేటర్ వ్యవస్థలు మరియు అత్యాధునిక మానిటరింగ్ పరికరాలతో మెడికవర్ హాస్పిటల్స్ వరంగల్ అత్యుత్తమ క్రిటికల్ కేర్ సేవలను అందిస్తోందని తెలిపారు. ఎన్ఏబీహెచ్ (నాబ్) గుర్తింపు పొందిన ఈ ఆసుపత్రి జాతీయ స్థాయి నాణ్యత మరియు రోగి భద్రత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, 24 గంటల ఎమర్జెన్సీ మరియు క్రిటికల్ కేర్ సేవలను అందించడంలో కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, సమయోచితమైన మరియు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా మెడికవర్ హాస్పిటల్స్ వరంగల్ అత్యవసర స్పందన వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తూ ముందుకు సాగుతోందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 23(ప్రజాజ్యోతి):** నగరంలోని ఆర్యవైశ్య ఉన్నత పాఠశాల 1996-97 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వైభవంగా జరిగింది. ఈ సమ్మేళనాన్ని పూర్వ విద్యార్థులు వినూత్నంగా నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో గురువులకు పాద పూజ చేసి వారి గురుభక్తిని విద్యార్థులు చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వి.ఎల్. నరసింహచార్యులు మాట్లాడుతూ, 30 సంవత్సరాల క్రితం పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలను, ఉపాధ్యాయులను గుర్తించుకొని అందరూ కలిసి వచ్చి గురుభక్తిని చాటుకున్నారు. అంతేకాకుండా గురువులకు పాద పూజ చేసి మేము ఎప్పటికీ మర్చిపోని జ్ఞాపకాన్ని మరియు ఆనందాన్ని ఉపాధ్యాయులందరికీ అందించారు. ఈ పూర్వ విద్యార్థులు అందరూ వివిధ రంగాలలో స్థిరపడినా అందరూ వీలు చూసుకుని వచ్చి ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించటం మా అందరికీ ఎంతో సంతోషాన్ని ఇచ్చింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, రామ్మోహన్, రామలింగం, విమలాదేవి, పూర్ణిమ, బాలరాజు, సెక్రటరీ రాజేశ్వరరావు మరియు విద్యార్థులు శరత్, శ్రీకర్, సదానందం, రాఘవ, డా. రాధ, రమాదేవి, రాధిక, శ్రీదేవి, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి సర్పంచ్ భరోసా

- 50 కిలోల బియ్యం పంపిణీ



**చెన్నారావుపేట ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి)** చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన మండల సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.మృతుని కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, మానవత్వంతో సర్పంచ్ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమ్మయ్య కుటుంబానికి గ్రామపంచాయతీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీరమల్ల సుదర్శన్ రెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డి, అడప అశోక్, ఎదురపోయిన వీరమల్లు, గోడిశాల స్వామి, మండల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి కూలీ మృతి.. కేసు నమోదు

**పర్వతగిరి, ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండల పరిధిలోని పంచరాయి తండాకు చెందిన యాకూబ్ (42) అనే కూలీ పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన సోమవారం రోజు చోటుచేసుకుంది. మృతుని భార్య బానోతు బుజ్జి ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాకూబ్ తండ్రి సొమ్లు. గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై అధికంగా మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో ఆరు నెలలుగా కడుపులో మంటలు, నొప్పితో బాధపడుతూ ఆహారం సరిగా తీసుకోలేక ఆరోగ్యం క్షీణించింది. 23-02-2026 సోమవారం ఉదయం కడుపునొప్పి ఎక్కువగా ఉందని చెప్పి పొలం వైపు వెళ్లిన యాకూబ్ మధ్యాహ్నం 12 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న దగ్గరి బంధువు బానోతు విజయేందర్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అతడిని ఏనుగల్ గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి, అక్కడి నుంచి వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3 గంటల సమయంలో యాకూబ్ మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య బానోతు బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పర్వతగిరి ఎస్ ఐ ప్రవీణ్ తెలిపారు.

## మహేందర్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం...

- - మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ సెక్రటరీ సీహెచ్ శంకర్ రావు
- - రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందించిన మజ్దూర్ యూనియన్



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 23(ప్రజాజ్యోతి):** సౌత్ సెంట్రల్ రైల్వే లో ట్రాక్మెన్ గా పనిచేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన మహేందర్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ సెక్రటరీ కామ్రేడ్ సీహెచ్ శంకర్ రావు అన్నారు. సికింద్రాబాద్ డివిజన్ ఇంజనీరింగ్ విభాగంలో ట్రాక్మెన్ గా పని చేస్తున్న సుడి మహేందర్ రెడ్డి ఇటీవలే విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయాడు. మహేందర్ రెడ్డికి మజ్దూర్ యూనియన్ లో రూ. 100 సభ్యత్వం ఉంది. దీంతో శంకర్ రావు ఆదేశాల మేరకు యూనియన్ నాయకులు మరణించిన రోజునే తక్షణమే సహాయంగా రూ. 50000 నగదును కుటుంబ సభ్యులకు అందించి పరామర్శించారు. ఈ సందర్భంగా సోమవారం మహేందర్ రెడ్డి కుటుంబానికి 1,50,000 రూపాయల చెక్కును యూనియన్ కేంద్ర కార్యాలయంలో శంకర్ రావు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా డివిజన్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్ తో కలిసి శంకర్ రావు మాట్లాడుతూ రైల్వే కార్మికుల సంక్షేమమే మజ్దూర్ యూనియన్ ప్రధాన లక్ష్యం అని అన్నారు. యూనియన్ లో వంద రూపాయల సభ్యత్వం ఉన్న కార్మికులు మరణిస్తే 2 లక్షల రూపాయలను ఇవ్వడం జరిగింది మజ్దూర్ యూనియన్ భరోసాగా అందిస్తున్నామని అన్నారు. మహేందర్ రెడ్డి కుటుంబానికి శాఖా పరమైన సేవలు అందేలా మజ్దూర్ యూనియన్ నిలబడుతుందని అన్నారు. యూనియన్ కార్మికులకే కాకుండా కార్మిక కుటుంబాలకు యూనియన్ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆఫీస్ బేరర్స్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ కామ్రేడ్ రవీందర్, డివిజనల్ ట్రెజరర్ కామ్రేడ్ నరసింహారెడ్డి, అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ సీసీఎస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ డాక్టర్ చిలుకు స్వామి, బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ కుమారస్వామి, చైర్మన్ ప్రభాకర్, ట్రెజరర్ సాగర్, వైస్ చైర్మన్లు తిరుపతి, రమేష్, ఉదయ్ కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ నరేందర్, ఘట్కేసర్ బ్రాంచ్ చైర్మన్ విజయ్ కుమార్ అసిస్టెంట్ సెక్రటరీ దిలీప్ ఆఫీస్ బేరర్స్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## డబుల్ బెడ్ రూమ్ సందర్శించిన సర్పంచ్ హసీనాభాను





**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ను సర్పంచ్ హసీనాభాను వార్డు సభ్యులతో కలిసి సందర్శించారు. గ్రామంలోని ప్రతి వార్డు పరిశుభ్రతగా ఉండాలన్నదే తమ లక్షంమని ఆమె అన్నారు, డబుల్ బెడ్ రూమ్ లోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రతగా చూసుకోవాలని అలాగే చెత్తను మురికి కాలువలో వేయకుండ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన వాహనంలో వేయాలనితెలిపారు. ఇందిరమ్మ ఇండ్లుకు అర్హులైన వారికి ఇండ్లు అందేలా చూస్తానని అన్నారు. అనంతరం కస్తూరిబా పాఠశాలను సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలపై సర్పంచ్ హసీనాబాను ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే వార్డు సభ్యులుకు కానీ నేరుగా తమ దృష్టికి కానీ తీసుకరావాలని వెంటనే సమస్య పరిష్కారిస్తామని సర్పంచ్ హసీనాభాను హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ తుంగల శ్రీజా, కార్యదర్శి కల్పన,వార్డు సభ్యులు అడప మానస, గడ్డం స్వామి, పడాల రాజ మౌళి, చీర్లవంచ చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి గ్రామ బీఆర్ఎస్ నూతన కమిటీ ఎన్నిక





**చెన్నారావుపేట ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి)** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం గొల్లపల్లి గ్రామంలో భారత్ రాష్ట్ర సమితి బీఆర్ఎస్ పార్టీ నూతన గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బాల్నే వెంకన్న, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మెర సతీష్ ఎన్నికయ్యారు.గౌరవ అధ్యక్షులుగా బట్ట మేకల చేరాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ధరావత్ భరత్ నాయక్, ఉపాధ్యక్షుడుగా భూక్య విజయ్ నాయక్,ప్రధాన కార్యదర్శిగా ఎర్రనాగుల స్వామి, కార్యదర్శిగా ఇదిగాని అశోక్,యూత్ ప్రెసిడెంట్ గా బానోతు నరేష్,ఉపాధ్యక్షుడుగా బట్ట మేకల అనిల్ రైతు విభాగం అధ్యక్షుడుగా భూక్యా శ్రీను,కమిటీ సభ్యులుగా బానోత్ ఈర్య, బాధావతి రవి, ధరావత్ దేవేందర్, భూక్య రెడ్య, బొమ్మెర రాములు, బట్ట మేకల రవికుమార్, బానోతు శంకర్, బానోతు గణేష్, అజ్మీర రాములు తదితరులు నియమితులయ్యారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయి నుండే కృషి చేయాలి

- - ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు



**వాజేడు, ఫిబ్రవరి 23, (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వాజేడు మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు వాజేడునాగారంలో గల ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశాన్ని మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వరరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సోయం ఆనందరావు ల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫౌండేషనల్ లిటరసి అండ్ న్యూమరసి, ఫౌండేషన్ లిటరసీ స్టడీ అనే అంశాలపై ఉపాధ్యాయులు చర్చించారు. రెండవ తరగతి, మూడవ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రాథమిక అక్షరాస్యత, చదవడం, రాయడం, గణిత సంఖ్యాజ్ఞానం మొదలగు విషయాలపై చర్చించారు. ఈ సమావేశాన్ని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ క్వాలిటీ కోఆర్డినేటర్-1 బి.శ్యామ్ సుందర్ రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్-4 గుళ్లపెల్లి సాంబయ్య, టాస్& ఉల్లాస్ ములుగు జిల్లా కో-ఆర్డినేటర్ పీర్ల కృష్ణబాబులు పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఆంగ్ల భాషలో ఉచ్చారణ, రాత నైపుణ్యాలను పెంపొందించుటకు ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయి నుండే కృషి చేయాలని అన్నారు. విద్యా పర్యవేక్షణ, మండల ఉపాధ్యాయుల హాజరు శాతం, పని తీరు ఉత్తమ స్థాయిలో ఉందని ప్రశంసించారు. ఈ సమావేశంలో రిసోర్స్ పర్సన్స్ బోదెబోయిన జయేందర్, సయ్యద్ అలీముద్దీన్ ఖాద్రి, సీఆర్పీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టుపై తరిగొప్పులలో భారీ నిరసన





**తరిగొప్పుల ఫిబ్రవరి 23 ప్రజాజ్యోతి.** భారతీయ జనత పార్టీ జనగామ జిల్లా ఆదేశాల మేరకు ఈరోజు తరిగొప్పుల మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకట్ రమణారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ గుండాలు దాడి చేసిన ఘటనను పరామర్శించేందుకు వెళ్లిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావును అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎ. డెల్లి రామ్ నరసింహ రెడ్డి, బీజేవైఎం ఉపాధ్యక్షులు పెద్దబోయిన రాజు, మండల ప్రధాన కార్యదర్శి పబ్బోజు రామ్ బ్రహ్మచారి, బూత్ అధ్యక్షులు భూక్య శ్రీకాంత్, శివరాం,అక్కరాజుపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు జొన్నగొని రాజు, జీల సతీష్, అనిల్ తదితరులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో ఎమ్మార్వోకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా జొన్నగొని రాజు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రజల సమస్యలపై పోరాడే నాయకులను అణచివేయడం ప్రభుత్వం నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు కొనసాగితే బీజేపీ ఆధ్వర్యంలో మరింత ఉగ్రంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీజేపీ నాయకుల అక్రమ అరెస్టులు ఆపాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

## మా పట్టా భూమి మాకు ఇప్పించండి





**వర్ధన్నపేట, ఫిబ్రవరి 23, ప్రజా జ్యోతి.** వర్ధన్నపేట మండలం, ఇల్లంద గ్రామంలోని కోమటికుంట చెరువు పరిసర ప్రాంతంలో ఉన్న పక్కా పట్టా భూమి దశాబ్దాల క్రితం కర్ణాలా కుటుంబానికి చెందిన భూమికి చట్టబద్ధమైన పట్టా పత్రాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం కొందరు రియల్ ఎస్టేట్ దందాదారులు అక్రమంగా కన్నేసి సాగు చేయక పాడుబడిన భూమి కుంటలా మారిన పరిస్థితి. కర్ణాలా కుటుంబ సభ్యులు సంవత్సరాలుగా గ్రామంలో నివసించకపోవడంతో, భూమి సాగుకు దూరమైంది. వర్షాల కారణంగా సమీప రైతుల పొలాల్లోకి వెళ్లాల్సిన వర్షపు నీరు ఈ భూమిలోనే నిల్వ ఉండి క్రమంగా కుంటలా మారింది. దీంతో కొందరు గ్రామస్తులు దానిని గ్రామ కుంటగా భావించడం ప్రారంభించారు. అయితే, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది ఇప్పటికీ మా వ్యక్తిగత పక్కా పట్టా భూమే అని యజమానులు స్పష్టం చేస్తున్నారు.గ్రామంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూమిపై కన్నేసి, కమిషన్ డిమాండ్ చేస్తూ ఒత్తిడి తెస్తున్నారు పాల్పడుతున్నారనే విషయాన్ని బాధితులు వెల్లడించారు.ఇది గ్రామ కుంట భూమి అంటూ అమాయక గ్రామస్తులను తప్పుదోవ పట్టిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మాకు చట్టబద్ధమైన పక్కా పట్టా ఉంది. రెవెన్యూ రికార్డుల్లో మా పేర్లే ఉన్నాయి. అయినప్పటికీ, అక్రమ కక్షధారులు గ్రామాన్ని రెచ్చగొట్టి బెదిరిస్తున్నారు.రెవెన్యూ అధికారులు స్పందించి మా భూమి మాకు ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## అంగన్వాడి బిల్డింగ్ కి భూమి పూజ చేసిన ఏఎంసి డైరెక్టర్



**టేకుమట్ల ఫిబ్రవరి 23 ప్రజాజ్యోతి న్యూస్** టేకుమట్ల మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్ బిల్డింగ్ కి భూమి పూజ చేసిన చిట్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగంపెల్లి కిరణ్ రావు అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ కి 12 లక్షల నిధులు కేటాయించినందుకు భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మరిన్ని నిధులు తెచ్చి మన గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ మానసా రెడ్డి,సర్పంచ్ బొడ్డు రాజేందర్,పంచాయతీ కార్యదర్శి అనిల్,మాజీ సర్పంచ్ రాచమల్ల సంపత్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు తోట మొండయ్య, ఉపాధ్యక్షులు సముద్రాల తిరుపతి,కాంగ్రెస్ నాయకులు పంతాటి తిరుపతి,నల్ల సారయ్య,రేణిగుంట్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## దౌలత్‌నగర్‌లో బతుకమ్మ విగ్రహ ధ్వంసం

- దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



**పర్వతగిరి, ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్ గ్రామంలో తెలంగాణ బతుకమ్మ తల్లి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటన గ్రామంలో కలకలం రేపింది. గ్రామ ఆడపడుచులు బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడుకునే చెరువు కట్టపై భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన బతుకమ్మ తల్లి విగ్రహంలోని బిడ్డల చేతులను విరగొట్టి దుండగులు పరారయ్యారు. బతుకమ్మ ఘాట్ వద్ద నిత్యం కొందరు మద్యం ప్రియులు మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విగ్రహ ధ్వంసం జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన వెలుగులోకి రావడంతో మహిళలు, యువకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ అనేది తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, అలాంటి పవిత్రమైన విగ్రహాన్ని ధ్వంసం చేయడం అమానుషమని గ్రామ పెద్దలు మండిపడ్డారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ధ్వంసమైన విగ్రహాన్ని తిరిగి నిర్మాణం చేయించి బతుకమ్మ ఘాట్‌ను సక్రమంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేశారు.

# ప్రజా సమస్యలపై అక్షర సమరం చేస్తున్న పత్రిక ప్రజాజ్యోతి

- - ములుగు డిఎంఅండ్ హెచ్ఓ నాగుర్ల గోపాల్ రావు



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ప్రజా సమస్యలపై నిరంతరం అక్షర సమరం చేస్తున్న పత్రిక ప్రజాజ్యోతి దినపత్రిక అని ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగుర్ల గోపాల్ రావు అన్నారు.ములుగు జిల్లా కేంద్రంలోని డిఎం అండ్ హెచ్ఓ ఛాంబర్ లో సోమవారం ప్రజాజ్యోతి – 2026 నూతన డైరీని ప్రజాజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎనగందుల శంకర్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాయితీతో కూడిన జర్నలిజం ఎవరికి భయపడకుండా పనిచేసి నప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. పత్రికలు నిష్పక్షపాతంగా సమస్యలను బయటకు తీస్తే అవి పరిష్కారమై చాలామందికి న్యాయం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంసిహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ శ్రీకాంత్,డిఎంఅండ్ హెచ్ఓ ఆఫీస్ సూపరింటెండెంట్ బి.విజయ భాస్కర్,అకౌంట్స్ మేనేజర్ కె.తిరుపతి రెడ్డి,సి హెచ్ఓ జి. దుర్గారావు,సీనియర్ అసిస్టెంట్ పి.గణేశ్,డిఈఓ కిరణ్,ఓఎస్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేని వాహన దారులకు పెట్రోల్ బంద్



**టేకుమట్ల ఫిబ్రవరి 23 ప్రజాజ్యోతి న్యూస్** మండకేంద్రంలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో నో హెల్మెట్....నో పెట్రోల్... కార్యక్రమాన్ని చేపట్టారు.సోమవారం టేకుమట్ల మండలంలోని హెచ్పి, భారత్ పెట్రోల్ బంకుల వద్ద నో హెల్మెంట్...నో పెట్రోల్...కార్యక్రమాన్ని నిర్వహించి వాహనదారులకు హెల్మెంట్ పై అవగాహన కల్పించారు. వాహన దారులు హెల్మెట్ లేకుండా వచ్చేవారికి పెట్రోల్ పోయవద్దని బంకు సిబ్బందికి సూచించారు.పెట్రోల్ కోసం బంకు సిబ్బందిపై ఒత్తిడి తెచ్చిన వారిపై అలాగే హెల్మెట్ లేకుండా వచ్చిన వాహనా దారులకు పెట్రోల్ పోసినా బంకు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్ లేకపోవడం వలన రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారని వాటిని అరికట్టేందుకే ఈ నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంకు సిబ్బంది,పోలీస్ సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

- రూ. 20 లక్షల నిధులతో ఒక్కో పంచాయతీ భవన నిర్మాణం



**ఖానాపురం /ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి )** ఖానాపురం మండలం చిలకమ్మ తండా, కీర్య తండా నూతన గ్రామపంచాయతీ భవనాలను సోమవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఒక్కో పంచాయతీ భవనానికి రూ. 20 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ పరిపాలన సౌలభ్యం కోసం నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందన్నారు. ప్రజా పాలనలో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

# మృతురాలు పూలమ్మ కు శ్రద్ధాంజలి ఘటించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.



**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 23ప్రజా జ్యోతి** మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాలమేరకు,ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న సూచనలమేరకు ఏటూర్ నాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చిటమట రఘు ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలోనీ మానసపల్లి గ్రామానికి చెందిన జెగజంపుల పూజ వివాహిత మహిళ గుండెపోటు రావడంతో ఆదివారం మృతి చెందడం తో మరణించిన పూజ పార్ధివ దేహాని కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.పూజా మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారని, ఈ కఠిన సమయంలో పార్టీ తరపున పూర్తి అండగా ఉంటామని నేతలు భరోసా ఇచ్చారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ గంపల శివ,పడిదల హనుమంతు, నెగరకంటి ముతేష్,పాగా నాగరాజు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు

- 15వ వార్డు సభ్యుడు నగవత్ కిరణ్ చొరవ



**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 23ప్రజా జ్యోతి** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా అంతరాయం సమస్యకు పరిష్కారం లభించింది. 15వ వార్డు సభ్యుడు నగవత్ కిరణ్ చొరవ తీసుకుని కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించి మరమ్మతులు చేయించారు. గత కొద్ది రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ లోపం కారణంగా స్థానికులకు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. సమస్యను గుర్తించిన వార్డు సభ్యుడు వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో సంప్రదించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేయించే చర్యలు చేపట్టారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పనులు పూర్తి చేయడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వార్డు సభ్యుడు నగవత్ కిరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

# పసిపాప చావుకు కారణం అయినా వారిని కఠినంగా శిక్షించాలి

- ధర్మసామాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి కండే రవి




**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి23** గణపురం మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కండే రవి మీడియా సమావేశంలో మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లా, కమ్మెర గ్రామంలో రజక (చాకలి) కులస్తులు గుడిలోకి వచ్చారని రెడ్డి కులానికి చెందిన తుకారాం రెడ్డి తన అనుచరులు, రజకులను విచక్షణ రైతంగా కొట్టి రెండు నెలల పసికందును కాలితో తన్ని చంపిన విషయాన్ని ధర్మ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. రెడ్డి వెలమలకు ఓట్లు వేస్తే గుడికి వెళ్లిన బడికి వెళ్లిన అణగారిన వర్గాలకు చెందిన వారు చనిపోవాలా ఇదేనా ప్రజా పాలన అంటే రెడ్డి అగ్ర కులానికి చెందిన వీరిపై మర్డర్ కేస్ నమోదు చేయాలి సర్పంచ్ పదవి నుండి తొలగించాలి ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని భారత రాజ్యాంగం కల్పించిన సమన్యాయం కల్పించాలని పోలీస్ యంత్రాంగానికి ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు.

# మొక్కజొన్న పంట నష్టపోయిన రైతును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి



**వర్ధన్నపేట ఫిబ్రవరి 23, ప్రజా జ్యోతి** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, ఉప్పరపల్లి శివారులో మొక్కజొన్న పంట నష్టంతో ఆందోళన చెందుతున్న రైతు చివ్వల మహేందర్‌ను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. ప్రైవేట్ కంపెనీ విత్తనాలతో సాగు చేసిన మొక్కజొన్నలో ఎకరంనర మేర పంట పూర్తిగా దెబ్బతిన్నదని రైతు మహేందర్ వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన అరూరి రమేష్, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకన్నతో ఫోన్‌లో మాట్లాడి, బాధిత రైతుకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు నాసిరకం విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, అధికారిక అనుమతులు ఉన్న డీలర్ల వద్ద నుంచే కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. రైతులకు న్యాయం జరిగే వరకు తన వంతు కృషి కొనసాగిస్తానని అరూరి రమేష్ హామీ ఇచ్చారు.

# మాజీ టెస్కాబ్ చైర్మన్ ను కలిసిన 6 వార్డు కౌన్సిలర్ దేవేందర్.



**వర్ధన్నపేట ఫిబ్రవరి 23 ప్రజా జ్యోతి.** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన 6వ వార్డ్ కౌన్సిలర్ మాలోత్ దేవేందర్, మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఐనవోలు గ్రామ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన కౌన్సిలర్ దేవేందర్, ఈ కార్యక్రమంలో జెత్య నాయక్, వెంకన్న, చందులాల్, రవి ,యాకు ,రాజేందర్ డి సి తండా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలి

- బిజెపి నాయకులు డాక్టర్ రఫీ



**మహా ముత్తారం,ఫిబ్రవరి 23.ప్రజాజ్యోతి** పసి పాప మృతికి కారణం అయిన నిందితులను కఠినంగా శిక్షిం బిజెపి నాయకులు డాక్టర్ రఫీ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మేర గ్రామంలో దర్శనం కోసం టికెట్టు లేకుండా గుడిలోకి ప్రవేశించారని రజకులను దుర్భాషలాడుతూ విచక్షణ రహితంగా దాడి చేసి,అసభ్య పదజాలంతో దూషించి రెండు నెలలు నిండిన పసిపాపను నిర్దాక్షణంగా కిరాతకంగా తన్ని, చంపడం దురహంకార చర్య అని ఆయన మండిపడ్డారు.ఇకనైనా ప్రభుత్వం స్పందించి నిందితులపైన కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## శ్రీ సంఘమేశ్వర దేవాలయం..హుండీ లెక్కింపు



**సంగెం,పిబ్రవరి23(ప్రజాజ్యోతి ):** మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సంఘమేశ్వర దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం రోజున స్థానిక సర్పంచ్ పేర్ల లలిత రమేష్ యాదవ్,చైర్మన్ మునుకుంట్ల కోటేశ్వర్ ఆధ్వర్యంలో లెక్కించగా 43,709 రూపాయలు మిగులు వచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆగపాటి రాజు,మాజీ సర్పంచ్లు కందగట్ల నరహరి,గుండెటి బాబు,గుండెటి ఎల్లయ్య,ఉపాధ్యక్షులు మునుకుంట్ల చందు,మెట్టుపల్లి శేఖర్,రాజశేఖర్,నూర శ్రీను,కోశాధికారి మునుకుంట్ల మోహన్,నాళం చంద్రశేఖర్,ఆలయ పూజారి నాగార్జునశర్మ, వార్డు మెంబర్ గొల్ల సందీప్ ,అంబేద్కర్ యువజన సంగం సభ్యులు కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## బాధిత కుటుంబలకు అండగా ఎస్ అర్ ఆర్ ఫౌండేషన్

- చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి




**రాయపర్తి, ఫిబ్రవరి 23, ప్రజా జ్యోతి** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సన్నూర్ గ్రామంలో వివిద కారణాలవల్ల అనారోగ్యం పాలైన బాధిత కుటుంబలు అయిన చిన్నపాక సాయులు, చిన్నపాక బిక్షం , తాండాల హనుమంత్, కత్తి సత్తెమ్మ, సూర సాయమ్మా ఇటీవల మరణించగా సోమ వారం వారి కుటుంబ సభ్యులను మాజీ రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు పరామర్శించి, ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబనికి 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్' లను సహాయం చేసిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపతి శ్రీనివాస్ రెడ్డి . ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, గజావెల్లి ప్రసాద్, కోలా సంపత్ స్థానిక నాయకులు అయిన స్థానిక సర్పంచ్ చిన్నపాక రజిత రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు పోతుల కొమురుమాళ్ళు, ఉప సర్పంచ్ చీకటి కర్ణాకర్,పార్టీ ముఖ్య నాయకులు పయ్యాల కొమురుమాళ్ళు, వేణు, సామ్రాట్, వెంకటలక్షి , చిన్నపాక శ్రీనివాస్, రాపాక మురళి, తాళ్లపెల్లి భరత్, సందీప్, సుధీర్, పోలేపల్లి ఉప్పలయ్య, నాయకులు పాల్గొన్నారు.

# మండలంలో దోమల విశ్వరూపం.

- గ్రామాల్లో ప్రజల జీవనం అస్తవ్యస్తం.
- ఫాగింగ్ చేసి, వ్యాధుల ముప్పు నుంచి కాపాడాలని
- మండల ప్రజల విజ్ఞప్తి.

**వర్ధన్నపేట, ఫిబ్రవరి 23,(ప్రజాజ్యోతి ):** వర్ధన్నపేట మండలం పరిధిలోని పలు గ్రామాలు మరియు పట్టణ కేంద్రంలో దోమల బెడద తీవ్రస్థాయికి చేరింది. ఇటీవల కురిసిన వర్షాల అనంతరం గ్రామాల్లో నిల్వ నీరు పెరగడం, డ్రైనేజీలు సరిగా లేకపోవడం, చెత్త పేరుకుపోవడం, చెరువులు మరియు కాలువల వద్ద శుభ్రత లోపించడం వంటి కారణాలతో దోమలు విపరీతంగా పెరిగాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల పెరుగుదలతో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల ముప్పు అధికమవుతుందనే భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. రాత్రి వేళల్లో దోమల కారణంగా నిద్రలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాంతో పాటు పగటి పనులు కూడా సక్ర



మంగా సాగడం లేదని వారు పేర్కొన్నారు. గ్రామాల్లో చాలా చోట్ల మురుగునీరు నిల్వ ఉండటం, డ్రైనేజీలు మూసుకుపోవడం, ఇంటి పరిసరాల్లో నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు దోమల పెరుగుదలకు కారణమవుతున్నాయని ప్రజలు అంటున్నారు. కొన్ని గ్రామాల్లో నెలల తరబడి దోమల నివారణ చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తక్షణమే ఫాగింగ్ (దోమల మందు స్ప్రే) చేపట్టాలని, డ్రైనేజీలను శుభ్రపరచాలని, చెత్తను తొలగించాలని, నిల్వ నీటిని తొలగించే ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది, పంచాయతీరాజ్ శాఖ, ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో ప్రత్యేక దోమల నివారణ కార్యక్రమాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా, ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలను చైతన్యపరచాలని కూడా సూచిస్తున్నారు.



అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని మండల ప్రజలు హెచ్చరిస్తున్నారు. మండల వ్యాప్తంగా దోమల నివారణపై అత్యవసర చర్యలు చేపట్టి ప్రజలను రక్షించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మతిభ్రమించి మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేత బడే నాగజ్యోతి

- కాంగ్రెస్ పార్టీ గురించి తప్పడు కూతలు కూస్తే ఊరుకునేది లేదు
- స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ తెలంగాణా ఇచ్చిన పార్టీ కాంగ్రెస్
- కాళేశ్వరం కూలి పాయే..సుందిల్లలో బొక్కపడే
- కాంగ్రెస్ పార్టీపై, నాయకులపై కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తే ఊరుకోం..
- నల్లగుంట సర్పంచ్ భూక్య శ్రీదేవి - శంకర్ నాయక్



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ నాయకురాలు నాగజ్యోతి మాట్లాడిన మాటలపై ఆత్మ విమర్శ చేసుకోవాలని హితభోద చేస్తూ అదేవిధంగా నువ్వు అన్నట్లుగా విమర్శలు చేస్తే ముందు కెసిఆర్ పాలనలో ములుగు జిల్లాలో ఏంచేశారో జిల్లా ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని నల్లగుంట ఎస్టీ కమ్యూనిటీ సర్పంచ్ భూక్య శ్రీదేవి – శంకర్ నాయక్ అన్నారు.

వారు సోమవారం మీడియాతో మాట్లాడారు.పదేండ్లలో నువ్వు కెసిఆర్ దేవాదుల ప్రాజెక్టుకు ఎన్ని నీళ్లు ఇచ్చాడో ముందు చెప్పు.. మా పార్టీ 2 ఏళ్ళలో గోదావరి జలాల కోసం 200 కోట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చారు.ములుగు నియోజకవర్గం (జిల్లా)లో అందరికి ఇండ్లు కట్టించాక నేను ఇల్లు కట్టుకుంటా అని ఓట్ల కోసం ఎన్నికల ప్రచారం లో చెప్పి ఎంత మందికి ఇండ్లు కట్టించి నువ్వు పెద్ద డూప్లెక్స్ ఇల్లు కట్టుకున్నావు. ఏజన్సీ ఏరియాలో పదేండ్ల లో బస్సు డిపో ఎందుకు ఇవ్వలేదు. ఏజెన్సీ ప్రాంతం లో కళ్ళు కనపడలేదా మా ప్రజా ప్రభుత్వంలో ఏటూరు నాగారంకు బస్ డిపో ఇచ్చినం.

ములుగులో అత్యాధునికతతో బస్టాండ్ నిర్మాణం చేస్తున్నాం.ఇది కూడా కనపడలేదా మీకు ? కేవలం ఓట్ల కోసం మీరు ఇచ్చారు.ప్రజల కోసం కాదు అనేది ప్రజలందరికి తెలుసు. గడిచిన పదేండ్ల కాలంలో ఎన్ని డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇచ్చావు.నువ్వు పుట్టిన ఊరులో మీ అత్తగారి ఊర్లో ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ఇచ్చిన ఇండ్లు కనపడటం లేదా నియోజకవర్గంలో అత్యధికంగా 5 వేల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కనపడటంలేదా,అదేవిధంగా మీ ప్రభుత్వం పదేండ్లలో ఎన్ని ఎకరాలకు ఋణమాఫీ చేశాడో చెప్పు జ్యోతమ్మా ? మా నాయకుడు సీఎం రేవంతన్న ఏకకాలంలో రెండు లక్షలు ఋణ మాఫీ చేశాం.వరి వేస్తే ఉరే అని కెసిఆర్ చెప్తే మా నాయకుడు సన్న వడ్లకు కింటాకు 500 రూపాయలు బోనస్ వేస్తున్నాం. జడ్పీ చైర్మన్ గా ఉన్న రోజుల్లో ఒక్కరూపాయి కూడా ఇవ్వ లేదు తేలేదు. కెసిఆర్ నువ్వు పదవులు అనుభవించిన 5 ఏళ్ళలో సర్పంచ్ నుండి ఇతరుల పదవులు లాక్కొని నువ్వు జడ్పీ ఛైర్మెన్ దాక నువ్వు ఏమీ చేశావు. ఏజెన్సీ ప్రజలకు నిన్ననే కదా సీఎం గోదావరి జలాల కోసం ములుగుకు 143 కోట్లతో పొట్లాపూర్ కు,అదేవిధంగా రామప్ప లక్నవరంకు 35 కోట్ల రూపాయలతో మరో 20 కోట్ల రూపాయలతో కన్నాయిగూడెంలో మంత్రి సీతక్క నీళ్ల కోసం రైతన్నల కోసం తెస్తున్నారు.పదేండ్లలో మీరు ఏమీ చేశారు.

రెండేళ్ళలో సీతక్క ఏంతెచ్చిందో బహిరంగ చర్చకు సిద్ధమా. ఆలోచనతో మాట్లాడూ.. ములుగు జిల్లాలో ఎక్కడ చర్చకు వస్తావో చర్చకు రండి అని సర్పంచ్ భూక్య శ్రీదేవి శంకర్ నాయక్ డిమాండ్ చేశారు.